పుస్తకం పేరు - తెలుగు తొలకరి
కవి పేరు -
కాలం -

# తొ లి ప లు కు

ఈనాడు విశాలాంధ్ర సారస్వతజగత్తులో వెల్లివిరియుచున్న చైతన్యమే "తెలుగు తొలకరి". ఇవి విశాలాంధ్రలోని వివిధ రచయితల తెలుగుతేనెల సోనలు. ఈ రచనలను ప్రకటించుకొనేందుకు అవకాశమిచ్చిన రచయితలకు, పత్రికాధిపతులకూ వీటన్నిటినీ పుస్తకరూపంగా సమకూర్చి సహాయపడిన శ్రీ తుమ్మల వెంకటరామయ్యగారికి కృతజ్ఞులం.

ఇదేవిధంగా మరికొన్ని గేయాలను, రైతు, కూలీ, క్షామం, శాంతి మొదలయిన వాటిపైన క్రమంగా ప్రచురించుతాం. రచయితలు, పాఠకులూ ఈ విషయంలో మాకు తోడ్పడ ప్రార్థన.

— ప్ర కా శ కు లు

AOUA104B115

# అంజలి

జోహార్లు జోహార్లు పొట్టి శ్రీరామా!
ఆంధ్ర జాతికి నీవు అసువులిచ్చావా!
పేరుకని రాముడని అన్నారు గానీ
రాముడన నీముందు ఎంతరా స్వామీ!
ఆ నాడు ఆ రాము డడవికేతెంచ
తోడుకొని వెళ్లెరా సతిని సోదరుని
ఏ తోడునీడైన లేకుండ నీవు
ఆకు లలములుగాని అన్నమ్ముగాని
ఆరగించక నీవు ప్రాణమిచ్చావు. జో॥

కలదు కైకమ్మరా సాటిగా మీకు
రాజ్యమ్ము వదలుకొను గతిని రాముండు;
రాష్ట్రమ్ము సాధించు కతనగా నీవు
జాతి గరువమునిల్ప జాతికాపాడ
జాతిజీవము నిల్ప జాతినిలుపంగ. జో॥

పంతమున భీష్ముడని యందురే గాని
పట్టిచూడగ భీష్ము డెంతరా నీకు?
తండ్రికోసమె అతడు పట్టి భీష్మింప
జాతి జీవము కొరకు భీష్మించి నిలచి
జాతికయి జీవమ్ము లర్పించినావు. జో॥

సత్యమున కీషత్తు తావులేదంటు
హృదయాన నైరాశ్యమలము కోగానే
దిక్కుతోచని మూడుకోట్ల ఆంధ్రులను
పురిగొల్పి మరివిడిచి ధృవుడవైనావా ?
ముక్కోటి గొంతుకలు ఎలుగెత్తినేడు
చాటుచున్నాయిరా నీదీక్షనిపుడు జో॥

శోకించకే ఆంధ్రమాతా! పునీత!
పొట్టి శ్రీరాముడే చూపెనేదారి;
ప్రతి ఇల్లు ప్రతిపల్లె ప్రతివాడునేడు
ఆంధ్రరాష్ట్రపుదీక్ష వహియించినారు
ఒక్కొక్క డొక్కొక్క శ్రీరాముడౌతు
రాష్ట్రసిద్ధికి ముందు కురికారుచూడు. జో॥

[రచన: శ్రీరాములుగారి నిర్యాణవార్త విన్నాక 15 డిశంబర్ 52]

— రాంషా

★

# దేశభక్తి

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్ !
గట్టిమేల్ తలపెట్టవోయ్ !

పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయ్ !
తిండి కలిగితె కండ కలదోయ్
కండ కలవాడేను మనిషోయ్ !

యీసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునోయ్ ?
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశి సరుకులు నించవోయి !

వెనుక చూచిన కార్యమేమోయ్ ?
మంచి గతమున కొంచెమేనోయ్ !
మందగించక ముందు అడిగేయ్ !
వెనుకపడితే వెనుకనోయ్ !

దేశాభిమానం నాకు కద్దని
వొట్టి గొప్పలు చెప్పుకోకోయ్
పూని ఏదైనాను ఒక మేల్
కూర్చి జనులకు చూపవోయ్ !

ఓర్వలేమి పిశాచి దేశం
మూలుగులు పీల్చేసెనోయ్,
ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయ్!

పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపికెక్కడ సుఖం కద్దోయ్?
ఒకరిమేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయ్!

స్వంతలాభం కొంతమానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్
దేశమంటే మట్టికాదోయ్!
దేశమంటే మనుషులోయ్!

చెట్టపట్టాల్ పట్టుకొని దే
శస్థులంతా నడువవలెనోయ్
అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయ్!

మతం వేరైతేను ఏమోయ్?
మనసు లొకటై మనుషులుంటే
జాత మన్నది లేచి పెరిగీ
లోకమున రాణించునోయ్!

దేశమనియెడి దొడ్డవృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయ్
నరుల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయ్!

ఆకులందున అణగి మణగీ
కవితకోయిల పలుకవలెనోయ్!
పలుకులను విని దేశమం దభి
మానములు మొలకెత్తవలెనోయ్!

— మహాకవి గురజాడ

★

# తెలుగోడా!

చేయెత్తి జై కొట్టు తెలుగోడా!
గతమెంతో ఘనకీర్తి గలవోడా!

సాటిలేనీ జాతి - ఓటమెరుగని కోట
నివురుగప్పి నేడు - నిదురపోతుండాది

జై కొట్టి మేల్కొలుపు తెలుగోడా!
గతమెంతో ఘనకీర్తి గలవోడా!

వీర రక్తపు ధార - వారబోసిన సీమ
పలనాడు నీదెరా - వెలనాడు నీదెరా

బాలచంద్రుడు చూడ ఎవరోడోయ్!
తాండ్ర పాపయగూడ నీవోడూ!

నాయకీ నాగమ్మ - మల్లమాంబ, మొల్ల
మగువ మాంచాల నీ - తోడబుట్టిన వోళ్ళు

వీరవనితలగన్న తల్లేరా
ధీరమాతల జన్మ భూమేరా

గతములో నీకీర్తి - కతలల్లి చెప్పారు
పసయేడ దాచావూ - వుసిలేకపోయెరా

బ్రతుకె బరువై యుంటి వీనాడూ
శతపోరి సాధించు తొలిపేరు

నాగార్జునుడి కొండ - అమరావతీ స్తూప
భావాల పుట్టలో - జీవకళ పొదిగావు

అల్పుడను కానంచు తెల్పావూ
శిల్పివంటివి దేశదేశాల
రాజ్యమంటే వీర -భోజ్యమన్నాడు మన
తిక్కనార్యుని మాట - ధీరులకు బాటరా
పూర్వ పౌరుషమెరిగి బ్రతకాలి
కార్యశూరులు నేడు కావాలోయ్
దేశమంటే వట్టి - మట్టి కాదన్నాడు
మనుషులన్నా మాట - మరువబోకన్నాడు
అమరకవి గురజాడ నీవోడు
ప్రజల కవితను చాటి చూపాడోయ్
రాయలేలిన సీమ - రతనాల సీమరా
దాయగట్టే పరులు - దారితీస్తుండారు
నోరెత్తి యడుగరా దానోడా
వారసుడ వీవెరా తెలుగోడా
కల్లోల గౌతమీ - వెల్లువల క్రిష్ణమ్మ
తుంగభద్రా తల్లి - పొంగి పారిన చాలు
ధాన్యరాసులే పండు దేశాన
కూడుగుడ్డకు కొదువలేదోయ్
పసిడి పాతర నీది - పరుల నోరూరెనోయ్
నీలో నీకేపెట్టి - నెత్తిచే యెట్టారు
దేశాన్ని దిగమింగి పోయినారోయ్
మోసాన్ని గుర్తెరిగి కాపాడోయ్
ఉత్తరాదీ మొదలు దత్తమండలమంత
తెలగాణ ప్రాంతముతో - చెలిమి గలిగించాలి

కలిసి మెలసి నేను పోవాలోయ్
కలిమి బలిమీ కూర్చుకోవాలి
ముక్కోటిబలగమోయ్ !- ఒక్కటై మనముంటె
యిరుగు పొరుగులోన - వూరుపేరుంటాది
తల్లి వొక్కతె నీకు తెలుగోడా
సవతి బిడ్డలపోరు మనకేలా
పెనుగాలి వీచింది - అణగారి పోయింది
నట్టనడి సంద్రాన - నావ నిలుచుండాది
చుక్కాని బట్టరా తెలుగోడా
నావదరి జేర్పరా మొనగాడా
స్వాతంత్ర్య భారతిలో - స్వేచ్ఛతో మన జాతి
లాయలాసలేని యా - కైలాసమౌతాది
చెయి గలిపి సాధించు స్వారాజ్యం
జయమంది భోగించు నీరాజ్యం

— శ్రీ కృష్ణ

★

# జాతీయగీతం

పాడరా ఓ తెలుగువాడా! పాడరా ఓ తెలుగువాడా!
పాడరా మన తెలుగుదేశపు భవ్యచరితపు దివ్యగీతము ॥పా॥

యుగయుగంబులనుండి బంగరు గంగనిచ్చెడు గౌతమీ నది,
కోహినూరును కురులసందున ముడిచి కులికిన కృష్ణవేణీ,
హాాయలుగా రతనాల సీమను ఓలలాడిన తుంగభద్రా,
సొగసుగూర్చును తెలుగుతల్లికి, సుఖముగూర్చును
తెలుగువారికి ॥పా॥

పాడుచును మన తెలుగు జోదుల ప్రతిభచాటిన వీరగాథలు,
ఆడుచును మన తెలుగుజండా పరువునిలిపిన మేలి ఘటనలు
పాడి పంటల పొంగి పొరలుచు దండిగా మన దేశముండగ
సాగిపోదము తెలుగుచరితపు వెలుగు జాడల వేగ మనమిక ॥పా॥

కదనరంగము నందు మెరసిన కాకతీయుల ఖడ్గతేజము,
వదరు శత్రువు నెదిరి పోరిన వనిత రుద్రమ యుద్ధపటిమ,
కొదమసింగము పగిది నురికిన బాలచంద్రుని బాహుదర్పము,
పొంగచేయద మేనిరక్తం? ఉప్పొంగజేయద
నీదుహృదయము? ॥పా॥

తెలుగు పలుకుల తేనెలొలికెను తిక్కనార్యుని కవితలోనా,
రాలుకరిగే త్యాగరాజుని రాగసుధలో మునిగి తెనుగూ

సొంపుగూర్చెను తెనుగు తల్లికి హంపి నగరపు శిల్పసంపద
భరతనాట్యపు భంగిమములో పల్లవించెను తెలుగు
పరువము ॥పా॥

తెనుగుజాతికి నూత్న సంస్కృతి తీర్చిదిద్దిన కందుకూరీ
తెనుగుభాషను ప్రజలభాషగ చేయ పోరిన గిడుగు పిడుగూ,
దేశమంటే మనుజులేనని తెలియజెప్పిన అప్పరాయడు
తెనుగుతల్లీ నోముపంటచె తేజరిల్లిన దివ్యతారలు ॥పా॥

పసిడి పండెడు మనదు దేశపు ఖనిజసంపద లన్నిగూరిచి
భారి యంత్రాగారములను పాదుకొల్పగ కదలిపోదము
ఒడలు తెలియని పరవశంబున కడలి జేరెడు నదుల జలముల
తెలుగుపొలముల మరల జేసీ, నిలుపుకొందము లక్ష్మినింటను ॥పా॥

పారతంత్ర్యము బాపి భారత భువిని భేదాల్ తొలగ జేదము,
ఆంధ్రరాష్ట్రము నొందిమనమూ అలదికొందము వీరగంధము
మూడుకోటుల తెలుగు బిడ్డలు ముక్తకంఠము తోడనైక్యత
జయము జయమని తెలుగుతల్లికి విజయగీతిక లాలపింపగ ॥పా॥

— కొండేపూడి లక్ష్మినారాయణ

★

# పలనాడు వెల లేని మాగాణిరా!

శాతవాహన తెలుగు చక్రవర్తుల శౌర్య
మిదె బ్రాహ్మ్యమిదె క్షాత్రమన్న గర్జాఘోష
పులకలే ఎత్తించెరా పలనాటి
పౌరుషమ్మే పొంగెరా॥

బుద్ధ నాగార్జునుడి బోధ ముద్రాజ్యోతి
వర "మహాయానమై" వసుమతి ప్రవహించి
హెచ్చుతగ్గులు సమసెరా పలనాట
విజ్ఞాన ప్రభ వెలిగెరా॥

తొలిసంజ దీక్షతో తెలుగు శిల్పులచేతి
పోగరలు మలిచిన బుద్ధయుగ జీవితము
నవశిల్ప రతనంబురా పలనాటి
నార్జునుడి కొండరా॥

వర్ణధర్మాలన్న ఉక్కుచట్టము పగిలి
మాలకన్నమదాసు మనసైన సుతుడుగా
వీరవైష్ణవ మొచ్చెరా పలనాట
బ్రహ్మన్న "కలి" గీతలో॥

మగువ నాగమ్మతో మాయయుద్ధము వచ్చె
మగువ మాంచాలతా మగని రణమున కంపె
వీరవనితలు పుట్టెరీ పలనాట
శౌర్యముగ్గులు పెట్టెరీ॥

బాలచంద్రుడి కత్తి పదును మెరుపులు మెరిసి
తెరలి కారెంపూడి ధర్మ రణరంగాన
వీర రక్తము చిందెరా పలనాట
నాగులేరై పారెరా॥
బాలచంద్రుని కదన కౌశలము కథలల్లి
శ్రీనాథ కవిరాజు చంద్రవంకకు చెప్ప
ఎదకరిగిప్రవహించెరా పలనాట
"ఎత్తిపోత"ల దూకెరా॥
కృష్ణరాయల సభా కవి దిగ్గజాలలో
"ఘటికా శతగ్రంథ కరణధుర్యం"డైన
భట్టుమూర్తి వెలసెరా పలనాట
ప్రౌఢశ్లేషలు పల్కెరా॥
కలిమి బలిమిాగల్గు కర్షకుల సీమలో
కానికాలము వచ్చి కలహములు చెలరేగ
కుంపినీ వాడొచ్చెరా పలనాట
ఖైదు కొట్టులు కట్టెరా॥
దాస్యమూ దోపిడీ దారిద్ర్యమూ హెచ్చి
పాడిపంటల మేలిబంగారు నాతల్లి
కరువు కాపురమయ్యెరా పలనాడు
కంటనీరే బెట్టెరా॥
ఒక్క సుముహూర్తాన ఉప్పొంగి భరతోర్వి
స్వాతంత్ర్య శంఖము సింహనాదము చేయ
మేరువై నిలచిందిరా పలనాడు
ముందుండి పోరిందిరా॥

కనెగంటి హనుమంతు కోరమీసము ద్రిప్పి
పలనాటి ప్రజలచే పన్ను లెగబెట్టించె
బలియిచ్చె హనుమంతునూ పలనాడు
పరప్రభుత్వపు గుండ్లకూ॥

ఆనాటి పౌరుషా లానాటి విక్రమా
లానాటి వైభవా లానాటి సంస్కృతు
లీనాటికీ చరితలో పలనాడు
విరచించె బంగారుతో॥

వెనుకతరములవారి వీరచరితల సిరులు
నారోసి త్యాగంపు నీర్వెట్టి పెంచరా
విరిసి సుఖములు పండురా పలనాడు
వెలలేని మాగాణిరా॥

— పి. వి. శివయ్య

★

# లెండోయి!

[ఆంధ్రరాష్ట్ర అవతరణకోసం మధనపడుతూ, మరణించుటకు పూర్వం శ్రీ కులపతి అడివి బాపిరాజుగారు రచియించిన ఆవేదనాపూరిత గేయం]

లెండోయి ఆంధ్రులార!
ఏకమ్ము కండోయి ఆంధ్రులారా!

ఆంధ్రజాతికి నేడు అవతరించెను కీడు
ఆంధ్ర తేజము ప్రతిభ అలమి పోయెనుపాడు
లెండోయి ఆంధ్రులారా

ఆంధ్రదేశము దూరమైపోయె ఆంధ్రులకు
ఆంధ్రరాష్ట్రము పరులు ఆక్రమించిరి కడకు
లెండోయి ఆంధ్రులారా

మనలోన మనకేమొ మనసులో కక్షలై
ధనము అధికారుల దాసులై చెడినాము
లెండోయి ఆంధ్రులారా

పాత గాథల గర్వపడితె లాభంఏమి
చేతలలో పందలై చెడిపోవు జాతికీ
లెండోయి ఆంధ్రులార

ఏకమ్ము కండోయి ఆంధ్రులారా!

— అడివి బాపిరా

# తెలుగు తొలకరి

తొలిచూలు నింగిలో తొలకరించిన మెరుపు
తెరతీసి చూసింది, కండ నెత్తుటి మెరుపు
ఆంధ్రరాష్ట్ర సువాంఛ,
స్వేచ్ఛా పతాకమై
తెలుగు దివి గుండెలో వెలిగిందిరా!
తెలుగు పుడమికి ఒళ్ళు పులకరించిందిరా!

తొలికారు చినుకులో రతనాలు జల జలా
పసిడిగడ్డకు మిసిమి ముత్యాలు మిల మిలా
రాసులై రాలుతూ
కనకాల సోలుతూ
తెలుగుజోదుల యెడద వెలిగిందిరా!
వెలుగు రేకుల పుడమి విరిసిందిరా!

రేయిలో తొలివాన వాగులో బుసబుసలు
ముసిరిన తుఫానులో ఏరులో రుసరుసలు
పలకరించిన మొయిలు
పులకరించిన బయలు.
తెలుగు తల్లికి తలుపులూగాయిరా!
వెలుగు వెల్లికి వలపు లూరాయిరా!

ఏడాది కేడాది కెటు నడచి వచ్చినదో ?
ఏ, పురాచరితలను ఏరుకొని తెచ్చినదో ?
ఇపుడు స్వేచ్ఛాగీతి వెడలగా
ఇపుడు స్వచ్ఛజ్యోత్స్న వెలుగగా
తెలుగు మొగసాలలో బ్రతుకు కదిలిందిరా !
ఆంధ్రవాహిని క్రొత్త తరగ లెత్తిందిరా !

తెలుగు తల్లి, తనువు పులకరించిందిరా
తెలుగు సీమకు వెలుగు తొలకరించిందిరా
నేడే నవజ్యోతి వెలుగగా
నేడే నవక్రాంతి మొలవగా
తెలుగు జోదుకు యొడలు జలదరించాలిరా
తెలుగు పుడమిని యిరులు అంతరించాలిరా !

— సోమసుందర్

★

# తెనుగు బిడ్డా!

పాడిపంటల - కాలవాలము
ప్రకృతిశోభకు - పట్టుకొమ్మ
కడిమియోధుల - కదనరంగము
కమ్మతెనుగున - కుమ్మహోదధి
తెనుగునాడిది - తెనుగువాడిది
తెలుసుకొనుమోయ్ - తెనుగుబిడ్డా!

ఇట్టి, నీదు భాగ్యసీమను
పట్టినలుగురు - పంచుకుంటె
నీకు కొదవై నీతిమాలి,
పరులపంచను - పాకిపోయి,
పెరలకెల్లను - బానిసౌదువ?
తన్నుమాలిన - ధర్మముండె?

కన్నుదెరువుము - కష్టమెరుగుము
తెనుగుబిడ్డా! - దేశమెరుగుము
ప్రాతకాలపు - నాటికథలను
తాత తండ్రుల - దండిమగటిమి
పెక్కురీతుల - పేరుకొంచు
ప్రొద్దుబుచ్చిన - ఫలితముండె?

దేశమెఱిగిన – తెనుగుబిడ్డవు
దీప్తిజెందిన – తేజమూర్తివి
స్థిరముగలిగిన – సుస్థిరుండవు
కమ్మ, కావలె – తెనుగుబిడ్డా !

పొత్తుపోరుకు – స్వస్తిజెప్పి
జారిపోయిన – ధీరతమమును
చెఱగిపోయిన – చిత్రకళలను
తెంపువడిన – తెనుగువాణిని
సంస్కరించుము – చక్కదిద్దుము
తెనుగు తల్లికి – తేజమిమ్మోయ్ !

— జి. సాంబమూర్తి

★

# ఆంధ్ర పతాకకు జై

జై జై జై ఆంధ్రపతాకకు జై
జై జై జై తెలుగుపతాకకు
బారుఫిరంగులు మ్రోగినా
బాంబుల వర్షము గురిసినా
యెత్తినజెండా దించకోయ్
ఆంధ్రపతాకకు జై.
నిజాంషాహి గుండియల్
బేజారెత్తి పోవగన్
బజాయించి యెత్తవోయ్
ఆంధ్రపతాకకు జై.
జమీందార్ల గుంపులన్
జాగీర్దార్ల దండులన్
తరిమిగొట్టి యెత్తవోయ్
ఆంధ్రపతాకకుజై.
సామ్రాజ్య వాదులన్
వారివారి తొత్తులన్
సాగనంపి యెత్తవోయ్
ఆంధ్రపతాకకు జై.
ముక్కోటి బలగమోయ్
దిక్కులు పిక్కటినోల్లయ్
ఒక్కత్రోవ నడువుడోయ్
ఆంధ్రపతాక నెత్తుడోయ్

— లింగుట్ల కోనేటప్ప

# హర్తాల్

హర్తాల్ హర్తాల్ హర్తాల్ !
నేడేను నేడేను నేడేను హర్తాల్
నేడే హర్తాల్ - నేడే హర్తాల్-
హర్తాల్ హర్తాల్ హర్తాల్ !!

నేడాంధ్ర వినువీధి నొక్కటే గంటగా,
నేడాంధ్ర జనహృదయ మొక్కటే మంటగా,
నేడాంధ్ర దీక్షా జయశ్రీరవమ్మ్మగా,
నేడాంధ్ర పౌరుషము వీతిహోత్రముగా,
హర్తాల్ హర్తాల్ హర్తాల్ !
గుండె గుండెకు తోరణమ్మ్మగా హర్తాల్-
పచ్చ పచ్చవి యవ్వనోద్వేగి హర్తాల్-
హర్తాల్ హర్తాల్ హర్తాల్ !!

నేడే వియత్ వీధి మ్రోగెను నగారా,
నేడే విజయవీధి వెలిగింది జ్వాలా,
నేడే జనం - ఘనా ఘనముగా కదలా,
నేడే విశాలాంధ్ర జయభేరి మొరవా,
హర్తాల్ హర్తాల్ హర్తాల్ !
ధూర్తులకు ప్రాణ ప్రమాదకర హర్తాల్ -
ఆర్తులకు జీవ సంజీవమనే హర్తాల్,
హర్తాల్ హర్తాల్ హర్తాల్ !!

యువకులంతా కలసి తోడుగా,
ప్రౌఢులంతా పెనగి మోతుగా,
ఇల్లిల్లు మొరసినది ఒక్క గొంతుకగా,
ఊరూర మొరసినది నవో త్తేజముగా,
హర్తాల్ హర్తాల్ హర్తాల్ !
జన హృదయ సంసేవ్యమాన మీ హర్తాల్,
ఘనరోచిరోజ్వల విభాతమీ హర్తాల్,
హర్తాల్ హర్తాల్ హర్తాల్ !!

పేట పేటా కదిలిరాగా,
కొట్టు కొట్టు బంద్ కాగా,
మిల్లు మిల్లూ మూతపడగా,
ఇల్లు యిల్లూ లేచిరాగా,
హర్తాల్ హర్తాల్ హర్తాల్ !
నేటికి సమైక్య జనకృత్యమీ హర్తాల్
నేటికి సజీవ హృత్ జన్యమీ హర్తాల్ !!

పొట్టివాడే నేటి పొడుగాటి బలగాన్ని
గట్టిగా కదిలించి త్రివిక్రముండైనాడు;
కనుకనే ఆంధ్రుల సువాంఛ కెవ డడ్డయిన
బలిచక్రవర్తివలె పాతాళమున కేగు.
నేడే శుభోత్సవము జరిపింది జనతా
నేడే వినూత్నదశ తెరిచింది హర్తాల్
నేడు స్వరాష్ట్రోద్యమము విలంఘించెగా
నేడే ఫణీంద్రమై కదిలింది హర్తాల్ !!

నందికొండకు జలోత్సవము జరిపించగా,
సిద్ధేశ్వరు శిరాన గంగ నిలుపంగా
రామపాద సాగరోదక కేళి కులుకగా
ఆంధ్రమాత గృహాంగణము సుఖాల్ ప్రేలగా,
హార్తాల్ హార్తాల్ హార్తాల్
ఇది ఎల్లి ఎర్రపూల్ విరియించు హార్తాల్
ఇది నేటి మల్లెపూల్ తురమించు హార్తాల్
హార్తాల్ హార్తాల్ హార్తాల్!!

కరువులూ కాటకాల్ పండుభూతలముగా
ఘనవిషూచీ మసూచీ జాడ్యముల్ పెరుగ
ప్రత్యంగుళ స్థలము పూసరక్షేత్రమై
జీవనాడుల తునాతునకలుగ త్రెంపగా
ఆంధ్రదేశము ఖేదమవతారమైనదే,
ఆంధ్రభారతి విఘాత రూపమై యున్నదే,
అందుకే సర్వజన హృదయమిా హార్తాల్!
అందుకే భావిభాగ్యోదయము హార్తాల్!!

ప్రతి పాఠశాల విద్యార్థులూ వీరులై
ప్రతి ఫ్యాక్టరీలోని కార్మికులు శూరులై
ప్రతికర్మ క్షేత్రాన హాలికులు యోధులై
మన విశాలాంధ్రయే విశ్వరూపమ్మనగ
కదలాలి కదలాలి హార్తాల్
అందరూ ఒక్కటై కదలాలి హార్తాల్!

ఆంధ్రభూమికి విజయమాదర్శమై వెలుగ
పుష్టిగా తుష్టిగా నిలుపాలి హర్తాల్ !!

జనులందరూరండి, కవులందరూరండి
కను తెరచి చూడండి మంచితరుణము నుండి
రైతులు, కార్మికులు గాయకులు రారండి
మస్తులు, గుమాస్తాలు వస్త్రాదులై రండి !!
తెలుగు తల్లికి కనులపండువీ హర్తాల్ !
తెలుగు కన్నుల వెన్నెలమరించు హర్తాల్ !
ఆంధ్రత్వ మీనాడు మెరిపించు హర్తాల్ !
ఆంధ్రజాతికి శోభలొనగూర్చు హర్తాల్ !

హర్తాల్ హర్తాల్ హర్తాల్ !
నేటినే కరిగించి మొలిపించు హర్తాల్
నేడేను నేడేను నేడేను హర్తాల్
హర్తాల్ హర్తాల్ హర్తాల్ !!

— సోమసుందర్

★

## రాయలసీమ

తెలుగు జాతికి వెలుగు
సమకూర్చి జగతిలో
పేరుదెచ్చిన సీమరా ! ఈసీమ
రాయలేలిన సీమరా !!

అఖిల భారతజాతి
కాజన్మ పూజ్యమై
ఆది అంతములేని
వేదముల కీ సీమ
భాష్యమ్ము నేరపిందిరా ! ఆదిలో
పరతత్త్వ మెఱిగిందిరా !!

హరిహరాదుల రూపు
హరిహరాయుండు
బుక్కరాయని బలిమి
తక్కువే ముందిలే ?
అరిభీకరులు వారురా ! ఈ సీమ
కామహాత్మ్యాలె మొదలురా !!

నేల నింగినిదాకి
పొంగి పొరలినదపుడు
కలము - బలమూకలదు
కత్తిబలముందిరా !

కృష్ణరాయల నాడురా! ఈ సీమ
స్వర్గ సీమయ్యిందిరా!!

ఉదయగిరి గడ్డలో
ఉదయమందిన బిడ్డ
ఉద్భూత లూగించి
ఉక్తియుక్తులు మెఱసి
నిలచినాడీ సీమలో తిమ్మరుసు
కృష్ణరాయల కండగా!

పోటుమగలై తెలుగు
జోదులందరు - కృష్ణ
రాయలకు - ఆనాడు
రాసులను సమకూర్చిరీ! కీర్తి
వారాసులను నిండించిరీ!!

కవుల కావ్యాలకూ
కళల సౌభాగ్యముకు
కుందనపు స్వామ్మూలేరా! ఆనాడు
రాయలే రత్నమ్మురా!!

సంపదల కొంపలూ
హంపిలో కూలాయి
పెనుగొండ గుండెలే
పగిలిపోయాయిరా!
కడలేక మేడ్చిందిరా! నేటికా
తుంగభద్రే సాక్షిరా!!

నాటి బంగరు సీమ
నేటి బెంగలసీమ
అర్థబలమే లేక
వ్యర్థమగు స్పర్థతో
మలమలా మాడ్చారురా! ప్రజలంత
వలవలా యేడ్చారురా!!

కరువు రాకాసికా
కరువు అగుటయేగాక
చెరిసగము చేశారురా! మన గుండె
నరికి నరికొోదిలారురా!!

నాటి తిమ్మరుసులూ
నాటి విద్యానగరరాజ్య నిర్మాతలూ
పునరుద్భవించారురా! ఈ సీమ
కనువిప్పి చూస్తుందిరా!!

నల్లమలలూ గుండె
ఝల్లుమను అడవులూ
గండికోట పెన్న,
సకిలేరు, పాలేరు
పెట్టనీ కోటలేరా! ఈ సీమ
ప్రకృతే అంతలేరా!!

అడుగడుగునా సిరులు
అణగి మణగిన పురులు
కడుపులో దాచిందిరా ! ఈ సీమ
చరితలో దాగుందిరా !!

ఆనాటి శౌర్యములు
ఆనాటి భాగ్యములు
ఆనాటి సౌఖ్యములు
ఈనాటి కీ సీమలో ! నిత్యమై
నిలచాయిరా ! గాలిలో !!

— శ్రీమూర్తి

★

# ముక్కోటి ఏకాదశి

ప్రొద్దుచెంగటసంజె పొంచివున్నది చూడు
మేలుకొమ్మని కోడి కూసినది యీనాడు
లేవోయి లేయింక లే తెలుగుబిడ్డా!
నిలుపుకో మెలకువగ నీ తెలుగుగడ్డా!

చదునగు వితర్దిని కపర్దివలె కూర్చుండి
నిరాశా శ్మశానమున మంత్రగాడై మహామంత్రి
రుద్రాక్షలుగ, తెలుగువీరుల కపాలాలన్నిట
జేర్చి, తనచేత మాలగా త్రిప్పు కొంటున్నాడు!

రాష్ట్రనిర్మాణ రణరంగమున నిహతుడై
చనిన ఆంధ్రునివెంట చనిపోయి రెందరో
తెలుగుతల్లికి కడుపుశోక మొనగూడినది
నిలువునా ఉరిపీఠమెక్కించబడె జాతి!

గోదావరీదేవి గొంతెండిపోయింది
కృష్ణకన్నీరోడ్చి సొమ్మసిలి పోయింది
తెలుగు కన్నీరొలికి మున్నీరు మించింది
నిలువు నిలువున మాతృమూర్తి క్షోభించింది!

తెలుగువాకిట దివ్వె కొడిగట్టు తున్నాదీ
వెలుగారిపోయి బ్రతు కణగారు తున్నాది
ఉద్యమోద్రేక తైలముపోసి త్రిలింగాన
వెలిగించువేగమే ఆంధ్రరాష్ట్ర జ్యోతి!

పల్లెపల్లెకు పిల్లలుద్యుక్తులైనారు
విద్యార్థులుద్యమోత్సాహులై కదిలారు
నాయకుల టోపీలు తీసిపారేశారు
మాయల మరాటీల ఆటకట్టేశారు!

కాకినాడను మహోద్రేక ముప్పొంగింది
రాజమహేంద్రములోన రైళ్ళాపివేశారు
నెల్లూరులో నెత్తురేరుగా పారింది
బెజవాడలో విజయభేరీ కొట్టినారు

ఎక్కడెక్కడ ఎంద రన్నలు గతించారో
అందరన్నల ఆత్మశాంతికై యీవేళ
తండోప తండాలుగా జనము లూరేగ
శాంతి, లారీలపై వెన్నాడుతున్నాది!

క్రోధఘూర్ణిత నేత్రమ్మునే విప్పాటకు
సాయుధమ్ముగనిలచి సమకట్టుతున్నాది
నల్లకళ్ళద్దాల నరకాసురాజ్ఞపై
విలయాగ్ని రగిలింప సిద్ధమవుతున్నాది

శీతశీకర కరాలు ముందుకుసాచి
భీతావహమ్ముగా మృత్యువు విలంఘించె
వొచ్చు సంక్రాంతికై తెలుగుదేశమునిండ
ఇంటింట ఒక్కొక్క భోగిమంటేద్దాము!

తెలుగునేలను తెలుగు వాడొకడు తప్పించి
వేరెవడు పాలించలేదు లేదనిచెప్పి
మ్రోగించు జయగంట నలుదిశల నేడే!
సాగించు జేగీయమానముగ నేడే!

తెలుగురక్తమ్ము తల్లి నొసట కుంకమ్ముగా
తెలుగుత్యాగము తల్లి మెడలోని నగలుగా
తెలుగుబిడ్డల నవ్వుసిగలోని పువ్వుగా
తెలుగులో విజగీషవెల్గు దళ్కొత్తగా

లేవోయి లేవయ్య లే తెల్గుబిడ్డా!
నిలుపుకోవోయి నీ బంగారుగడ్డా!
వరిచేల శిరమెత్తి సిరినాట్యమాడగా
సరదాలు జలదాల తళతళా మెఱయగా

సెలయేరు లల వోక రాగాలు తీయగా
తీయగా తెన్గుపూదేనియలు కురియగా
లేవోయి రావోయి రా తెలుగుబిడ్డా!
నిలుపుకోయి నీ బంగారుగడ్డా!

— శశాంక

★

# రాష్ట్రగానం

విశాలాంధ్ర ప్రజలారా!
వేకువ జామాయెను నేడే
నవభానుని నిర్మల కాంతులు
దశదిశలా తేజరిల్లు
సత్వరమే ఆంధ్రరాష్ట్రం
తప్పక సిద్ధిస్తుంది
తపిస్తున్న మన జనహృదయం
తప్పక పులకిస్తుంది
భవిష్యత్తు అంచులపై
భద్రంగా నడవండి
మనమేసే ప్రతి అడుగు
ముందువారికి అనుభవాల
మడుగు
సగర్వ ఆంధ్రమాత
తనయా తనయులార
దేశానికి తలమానికమగు త్రోవ
మరల్చండిక మన వాంఛలు
విశాలాంధ్ర ప్రజారాజ్య
విజయదుందుభి మ్రోగించుటకై
చిరకాలం కలలుగన్న
మన కోరిక నెరవేరే
సమయం నేడాసన్నమాయె

తమ ప్రాణాల్ తృణప్రాయంగా
మన జాతికి మంచిగూర్చ
మహా ప్రయత్నంలో
వెచ్చించిన వీరవరుల
నొకటసారి స్మరిద్దాం!
విశాలాంధ్ర జయపతాక
వినువీథుల నెగిరిద్దాం
అమర వీరుల ఆశయాల్
సాధించగ దీక్షపూని
కదలిపోదమిదే లెండు!
సాగిపోదమిదే రండు!

— శివరామకృష్ణరావ

★

# ఇదీ దారి

తెనుగునదుల నీళ్ళలాగ
మనలోగల ఉత్సాహం
నిర్మాణాత్మక శక్తుల
నిర్వహణం లేనందున
ఉప్పునీటి కడలిలోకి
ఊరక ప్రవహించిపోయె;
అందరాని చందమామ
యందలికుందేటి కొమ్ము
సాధించే యత్నంగా
సాగించే ఉద్యమాల
ఆర్భాటం ఆపేద్దాం!
సంరంభం చాలిద్దాం!

పదిమందీ కలిసికూడ
బలుక్కునే పరిషత్తున
ఎవడో ఒకడే నిలబడి
ఎల్లరికి అడ్డంపడి
అల్లరికే దారితీసి
అందరికీ హానిచేసి
నియంతృత్వ ధోరణిలో
నిజంమీద ముసుగుకప్పి
తనదారిని తాబోతే
మనరాష్ట్రింవస్తుందా ?

ఆచరణకు కాకుంటే
అసంబ్రాక తీర్మానమేల ?
కాపుర మిష్టంలేందే
కళ్యాణం ఎందుకొరకు ?

సోడాపొంగిన పోలిక
శుష్కావేశా లెందుకు ?
తాడూబొంగరములేని
దండుగ పథకా లెందుకు !
తాతలు నేతులు తాగిన
పాతకథలు త్రవ్వనేల
చారడేసి కళ్లైనా
శవంవల్ల ఏంలాభం ?
తెలుగునేల వికసించే
తెరువేదో వెదకొద్దా ?
తెలుగుకోర్కె ఫలియించే
తెరగేదో చూడొద్దా ?
చీటికిమాటికివచ్చే
కాటకాల మాటేమిటి?
కూటిని గూటినిచూపే
సూటియైన బాటేమిటి?

అన్నలార తమ్ములార !
అఖిలాంధ్ర జనమ్ములార !

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

ఆవేశాలొదిలిపెట్టి
ఆలోచించండి మీరు!
పాతవి నెమరేసుకొనే
తాతలు మననాయకులా?
నూతనమార్గంచూపే
నేతలులేనే లేరా?
చేతికందనున్న ఫలము
గోతిపాలు కావాలా?
మదరాసుకు ముడివేసుకు
మనరాష్ట్రం పోవాలా?

మొదటి పనులు మొదటచేసి
తదుపరిసంగతిచూదాం!
మనదేదో మనకొస్తే
మడిమాన్యా లొచ్చినట్టు!
విరోధాలు రాకుండా
వివాదాలు లేకుండా
సత్వరమే మనరాష్ట్రం
సాధించడమే శ్రేష్టం!
మొట్టమొదటి మెట్టుమీద
గట్టిగకాలూని, పిదప
చిట్టచివరిదాకా మన
పట్టుదలను సాగిద్దాం!

మూడుకోట్ల జనం మనం
ముమ్మాటికి గెలవగలం!
సాటిలేని తెలుగుబలం
మేటిదనుచు చాటగలం!
చీల్చబడిన పరగణాలు
చేర్చి ఒకటి చేయువరకు
విశాలాంధ్ర వచ్చువరకు
విరామమే లేదుమనకు!

— శ్రీశ్రీ, ఆరుద్ర

(తెలుగుస్వతంత్రనుండి)

★

# మార్చింగ్ సాంగ్

తెలుగుతల్లి బిడ్డలం – తెలంగాణ వీరులం
మాతృదేశ ముక్తి కొరకు – పోరుసల్ప కదలినాం ॥తెలుగు

వెట్టిపనుల కట్టిపెట్టి – జబర్దస్తి నెగురగొట్టి
స్వేచ్ఛగాను బ్రతుకు కొరకు – ఐక్యమై నిలచెదం ॥తెలుగు॥

తరతరాల నుండి మేము – సాగుచేయు భూమినంత
లాగుకొన్న దేశముఖుల – సాగనంప దలచినాం ॥తెలుగు॥

తెల్లదొరల పెద్దతొత్తు – ఘనుడనైన ప్రభువునంచు
పంపుగాక మిలిటరీని – చంపలేడు మాదుశక్తి ॥తెలుగు॥

కరకు నిజాం తోడకలిసి – దోపిడి బ్రిటిష్‌వాళ్ళు
చీల్చినారు తెలుగుభూమి – చేర్చవలెను ఒకటిగా ॥తెలుగు॥

— కొండేపూడి

★

# కళకళలాడే తెలంగాణ

పల్లవి

కళకళలాడే కనకము కురిసే తెంగాణభూమి
మా తెలంగాణ భూమి

పచ్చ పచ్చని పైరు అచ్చుబోసింది భూమి
వచ్చింది దున్నే వారికి భూమి తెలంగాణలోన
మా తెలంగాణలోన ॥కళకళ॥

మురికి పాలన కూలె దొరలంత పారిపోయె
చెరవదలింది మెరిసిపోతుంది తెలంగాణ భూమి
మా తెలంగాణ భూమి ॥కళకళ॥

ఓ... మేడిబట్టిన రైతురాజ, మొగసిరిగ తొడగొట్టరా
కూడు లేదను ఆర్తనాదము కూల్తునని గర్జించరా

చివరి ఆశతో వచ్చు దోపిడి దొరల కుక్కల తరుమగా
పట్టరా నీ జండ ప్రజల పాలనము నిలబెట్టరా
పట్టరా...పట్టరా ॥కళకళ॥

— అజ్ఞాత తెలంగాణకవి

★

# తెలగాణ

రాజరాజులబొగడ వంది మాగధుడగాను
రైతుజాతికి నేను వైతాళికుడ నన్న
పోతన్న కవి గుండెలో — తెలగాణ
చైతన్యమే పండేరా !

వీరాంధ్రి చరితలో విజయశంఖమునూది
కాకతీయుల కత్తిలోకాల బాలింప
వైరి వీరుల పక్కలో — తెలగాణ
బల్లెమై పొడిచిందిరా !

ఓరుగల్ కోటపై వైరి గమ్మినవేళ
తెలుగు జండా లెత్తి దేవి రుద్రమరాణి
పసిడి కత్తుల దూసెరా — తెలగాణ
నోసట కుంకుమ మెరిసెరా !

తెలుగు దేశపు కీర్తి దిశలన్ని వెలిగించి
కాలగర్భములోన కలలాగ కలిసింది
బంగారు మన తల్లిరా — తెలగాణ
పరులపాలైనాదిరా !

ఐకమత్యమువీడి అణగిపోయిన తెలుగు
రాణి వాసములెక్కి రాజ పట్టముగట్ట
సులతాను పాలనలో — తెలగాణ
కలతపడి పోయిందిరా !

కుంపెనీ వాడితో కుటిల మాయలుబన్ని
సులతాను సైతాను కలిసి దోపిడిచేయ
బానిసల బానిసై—తెలగాణ
అణగారి పోయిందిరా!

గతిమాలి కరువుతో బ్రతుకుమార్గము లేక
పడరానిపాట్లతో కొడిగట్టి ప్రాణాలు
దారిద్ర్య భారమ్ముతో—తెలగాణ
కరగి నీరై పోయెరా!

కోటి బిడ్డలతల్లి కూడుగుడ్డలు లేక
వందలాదీ యేండ్లు బందియై పడియుండి
తల్లడిలిన గుండెతో—తెలగాణ
అల్లాడి పోయిందిరా!

దౌర్జన్య పాలనకు తలలొగ్గరాదంచు
వీరాంధ్రి శౌర్యము వెల్లువలైపొంగ
ఎదురొడ్డి సమరమ్ములో—తెలగాణ
కదిలి విజృంభించెరా!

నైజామునాజీలపై ప్రజల నడిపించి తా
అమరుండు కొమరయ్య ఆత్మార్పణము
జేసి పౌరుషమ్మె నిల్పెరా—తెలగాణ
చరితలో పేరెక్కెరా!

పాడు దాస్యమ్ముతో బ్రతికినా ఫలమేమి ?
జాతి కోసముపోరి చచ్చుటే మేలంచు
వెల్లువై పొంగిందిరా — తెలగాణ
పడుచు రక్తమ్మురా !

చావ లేదింక మాజాతి శౌర్యజీవనము
చల్లార లేదింక మావేడి రక్తమ్ము
తుదిదాక వదలమంటు — తెలగాణ
ఎదురొడ్డి నిలిచిందిరా !

ముక్కోటి తెలుగుల్లు ఒక్కటై లేవాలి
స్వాతంత్ర్య సిద్ధికై జయభేరి మ్రోగాలి
లెండనీ పిలిచిందిరా — తెలగాణ
రండనీ కోరిందిరా !

భావిసంతతికెల్ల ప్రణవమంత్రమ్ముగా
స్వాతంత్ర్య నినదమ్ము సింహాగర్జనచేసి
జేజేలు వెలుగొందురా — తెలగాణ
పూజింప బడుచుండురా !

— దాశరధి

★

# వేగుజుక్క

("పలనాడు వెలలేని మాగాణిరా" శైలి)

క్రూర నైజామునూ - గోరిగట్టగనాడు
నలగొండ యోధులూ - వెలిగించినా జ్యోతి
నలుదిశలు ప్రాకిందిరా - తెలగాణ
సింహనాదము చేసెరా!

పాతకాలపునాటి - దోపిడీ దాస్యాన్ని
పాతిపెట్టాలనే - పరమావధిని దీర్చ
ఏకమై నిలచిందిరా - తెలగాణ
శతృదండుల తరుమగా?

ప్రజల రక్త త్రాగి - బలిసి క్రొవ్వెక్కిన
దోపిడీ గుంపులు - పట్నవాసముపట్ట
కళ కళ లాండిందిరా - తెలగాణ
శతృ శేషము లేకనూ!

చెమటోడ్చి పండించు - రైతుకూలీలంత
ఘోరాడి గెల్చిరీ - భూమిపై హక్కును
మార్గదర్శకమాయెరా - తెలగాణ
భారతావని కంతకూ!

తరతరంబులనాటి - బానిసాముక్తికై
తెలగాణ వనితలు - వీరగర్జనచేసి
కదనరంగము దూకిరీ - తెలగాణ
వైరిమూకల దునుమగా!

వెనుక కాలాలలో - కని వినీ ఎరుగని
స్త్రీ పురుషులందరు - వోటు హక్కును పొంద
గ్రామ ప్రజరాజ్యాలనూ - తెలగాణ
తొలిసారి చవిజూచెరా!

నవజీవనంబుతో - మందహాసము చేయు
తన గ్రామసీమలను - రక్షింపబూనగా
ఆయుధము చేపట్టెరా - తెలగాణ
మేరువై నిలచిందిరా!

రజాకారు గూండాలు - నైజాము మిలటరీ
కండ్ల కావరముతో - గ్రామాలపై బడగ
వెన్నంటి తరిమిందిరా - తెలగాణ
శౌర్యపటిమను జూపెనూ!

నాజినైజాముతో - నీచరాజీపడిన
కాంగ్రేసు ధనికుల - కపటనాటకమంత
తెలిసికొని లేచిందిరా - తెలగాణ
కాలహరణము చేయకా!

ప్రజల రాజ్యాలనూ - వమ్ముచేయుటకొరకు
కాంగ్రేసు సైన్యాలు - దొరలకండగరాగ
కొండయై యెదిరించెరా - తెలగాణ
నెత్తురే వొలకించెనూ!

నైజాము పాలనను - సాగనంపేవరకు
నిద్రబోయేమాట - యిలలోన కల్లయని
రణభేరి మ్రోగించెరా - తెలగాణ
విప్లవం నినదించెనూ!

తెలగాణ వీరుల సమరనాదపు పిలుపు
అందుకొని ప్రజలంత - భరతదేశములోన
సాగిరండని చెప్పనూ - తెలగాణ
వేగుజుక్కై వెలసెనూ.

— తెలంగాణ అజ్ఞాతకవి

★

# మన తెలంగాణా

మన తెలంగాణలో రణభేరి మ్రోగింది
మనిషి మనిషి నడుముకట్టాలి:
కట్టి
మన శత్రువును కూలగొట్టాలి:
మెర్ర
జెండాలు యింటింట కట్టాలి:
ఆంధ్ర
సంఘాలు వూరూర పెట్టాలి:
నలగొండరణములో తెలుగు తెగువనుచూపి
బలిమైన వీరులను తలవాలి:
వారు
నిలిచిపోరినచోట నిలవాలి:
నిలచి
హిందువులు ముస్లిములు కలవాలి:
కలసి
తెలంగాణా సంకెళ్ళు త్రెంచాలి:
ముక్కోటి ఆంధ్రులను, ముక్కలుగ చేసినా

తెల్లదొరలను సాగనంపాలి

వారి

కల్లమాటలు కాల రాయాలి;

వారి

తొత్తురాజుల తోలివేయాలి;

ప్రజల

రాజ్యమ్ము స్థాపింప వేగరావాలి.

— దాశరథి

★

# ఖ బ డ్దా ర్ !

ఖబడ్దార్ ! ఖబడ్దార్ !
నైజామ్ పాదుషాహె !

బానిసత్వ విముక్తికై
రాక్షసత్వ నాశముకై
హిందూ-ముస్లిం పీడిత
శ్రమజీవులు ఏకమైరి.
తమపై స్వారిచేసే
దేశముఖుల ప్రతిఘటించి
ప్రజాకోటి పోరుతోంది !

ఒక వీరుడు మరణిస్తే -
వేలకొలది ప్రభవింతురు !
ఒక నెత్తురు బొట్టులోనె
ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు
ఖబడ్దార్ ! ఖబడ్దార్ ! !

సూర్యపేట, బాలేముల
వీరుల కాలేహృదయపు
ఆశలు కాంతించుతాయ్.
అమరుడు - మా కొమరయ్య
అనంతయ్య - అనంతుడే.

అజేయులై, ప్రకీర్తులై
చిరస్థాయి నిలుస్తారు!
చరిత్రలో, చరిత్రలో
చిరస్థాయి వసిస్తారు!!
ఖబడ్దార్! ఖబడ్దార్!!

నైజామ్ కీచకుడా!
నీ పీచమడంచ ప్రజలంతా
ఒక పిడికిట ఒక గొంతుక
ఒకమోతై ధ్వనిస్తారు!
ఒక శక్తయి జ్వలిస్తారు!!
మృతవీరుల స్మరిస్తారు!
నవయోధుల సృజిస్తారు!!

బానిసజన శల్యములను
పేర్చి కూర్చి నిర్మించిన
నీ రాక్షస సింహాసన
మధిగదిగో కదులుతోంది!
మెషిన్‌గన్‌లు, మరఫిరంగి
తుపాకులూ, విషవాయువు
ప్రజాశక్తి నాపలేవు!
ఖబడ్దార్! ఖబడ్దార్!!

తెల్లపంది సేనలతో
ఆకిన్‌లెకు – పందికొక్కు

త్రవ్వి పెట్టు గోరీల్లో!
నిరవధికం, నిరంకుశం.
సహింపనీ, భరింపనీ.
ధీర ప్రజా కోటికొరకు
త్రవ్వించే గోరీల్లో
నీ నిరంకుశత్వాన్నే
పాతేస్తాం! పాతేస్తాం!!
పాతేస్తాం! ఖబడ్దార్!!
విశాలాంధ్ర ప్రజాస్వామ్య
మమరుస్తాం ఖబడ్దార్!!

— సోమసుందర్

★

# మేలుకోవోయే

తెలుగుబిడ్డా మేలుకోవోయ్
నైజాము
తెలుగుబిడ్డా లేచిరావోయ్ ॥తెలు॥

నదులు నగములు గనులు – నలనల్లభూములూ
కలవు నీదేశాన – గంజినీళ్ళే కరువ ! ॥తెలు॥

దున్ని చెమటోర్చి ఈ – మన్ను బంగరుజేసి
కరువుతోజచ్చేటి – గతి ఏమిపట్టినది ? ॥తెలు॥

ఉన్నభూమిని విడచి – కన్నీరుగార్చుచూ
ఇన్నిటికి రిక్షాను – ఎన్నాళ్ళు లాగెదవు ॥తెలు॥

ఈభూమి నీదెరా – ఈ గనులు నీవెరా
ఎవడు ఈనైజాము? – ఎవరు ఈ దొరలంత ? ॥తెలు॥

రుద్రమాంబ ప్రతాప – రుద్రులకు వారసుడ !
పౌరుషము జూపించి – పరువు నిలబెట్టరా ॥తెలు॥

బందగీ రక్తంబు – చిందిజ్వాలైలేచి
జాగీరుదారులను – ఊగించివేసింది ॥తెలు॥

నిన్న సూర్యాపేట – మొన్న జనగాములో
నీ యన్నదమ్ములను – నిలబెట్టికాల్చారు ॥తెలు॥

మగల కండ్లెదుటనే - మగువలను చెరిచారు
ఇంత నీచపు బ్రతుకు - ఎందుకోయీ బ్రతికి ॥తెలు॥

మాడి చచ్చేవారి - మతములన్నీ ఒకటె
కొంపలార్చేవారి - కుట్రలో పడబోకు ॥తెలు॥

కదిలించి బలగాన్ని - ఎదిరించి వైరులను
శక్తి చూపించగల - సమయమిదె లేలెమ్ము ॥తెలు॥

— సుంకర

★

# జయగీతి

పట్టరా వడిశాల – కొట్టరా దెబ్బ
పరిగ పిట్టలమంద – పారిపోవాలి ॥పట్టరా॥

పంట ధ్వంసముచేయు – పందు లవిగోర
బాకునా, బల్లాన – పగల జీరుమర ॥పట్ట॥

ముందుకురికీ తగిలి – పందు లన్నిటిని
మందేసి కొట్టరా – కందికాయలె ॥పట్ట॥

కూలీలు రైతులూ – కూడి కేకేస్తే
క్రూరమృగముల గుండె – జారిపోవాలి ॥పట్ట॥

రామబాణమర నీ – రాయి దెబ్బంటె
రమ్మురా వైరులను – దుమ్ము జేయాలి ॥పట్ట॥

తెలుగోడ నీలోన – పలుకు మిగిలుంటె
తెలుగు కత్తిని నేడు – ఝుళిపించవోయి ॥పట్ట॥

పట పటా యీ దాస్య – బంధాల తెంచి
స్వాతంత్ర్యమును పొంది – జైగీతి పాడు ॥పట్ట॥

★

# మరో ప్రపంచం

మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి
కదం త్రొక్కుతూ
పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ
పదండి పోదాం వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం ?
దారిపొడుగునా గుండెనెత్తురులు
తర్పణచేస్తూ పదండి ముందుకు
బాటలు నడచీ
పేటలు కడచీ
కోటలన్నిటిని దాటండి
నదీ నదాలు అడవులు కొండలు
ఎడారులా మన కడ్డంకి ?
పదండి ముందుకు పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి

ఎముకలు క్రుళ్ళిన
వయస్సు మళ్ళిన
సోమరులారా! చావండి
నెత్తురుమండే
సైనికులారా! రా రండి
'హరోం హరోం హరహరహర
హరోం హర' అని కదలండి
మరో ప్రపంచం
మహా ప్రపంచం
ధరిత్రినిండా నిండింది.
పదండి ముందుకు
పదండి త్రోసుకు
ప్రభంజనంవలె — హోరెత్తండి!
భావ వేగమున ప్రసరించండి!
వర్షుకాభ్రముల ప్రళయ ఘోషవలె
ఫెళఫెళఫెళఫెళ విరుచుకు పడండి
పదండి
    పదండి
        పదండి ముందుకు
కనపడలేదా మరో ప్రపంచపు
కణకణ మండే త్రేతాగ్ని?
ఎగిరి ఎగిరి పడుతున్నవి
ఎనభై లక్షల మేరువులు,

తిరిగి తిరిగి సముద్రాల్
జలప్రళయ నాట్యం చేస్తున్నవి
సలసల కాగే చమురా? కాదిది,
ఉష్ణరక్త కాసారం
శివసముద్రమూ నయాగరావలె
ఉరకండీ, ఉరకండీ ముందుకు!
పదండి ముందుకు!
పదండి త్రోసుకు
మరో ప్రపంచపు కంచు నగారా
విరామ మెరుగక మ్రోగింది,
త్రాచులవలెను రేచులవలెను
ధనంజయునిలా సాగండి
కనపడలేదా ?
మరో ప్రపంచపు
అగ్నికిరీటపు ధగధగలు !
ఎర్రబావుటా నిగనిగలు !
హోమజ్వాలల భుగభుగలు !

— శ్రీ శ్రీ

*

# వినిపిస్తారోయ్ విప్లవ శంఖం

పొలాల నన్నీ
హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యం నిండగ
విరామమెరుగక పరిశ్రమించే
బలం ధరిత్రికి బలికావించే
కర్షక వీరుల కాయం నిండా
కాలువకట్టే ఘర్మజలానికి
ధర్మజలానికి
ఘర్మజలానికి
ఘర్మజలానికి ఖరీదు లేదోయ్

నరాల బిగువూ
కరాల సత్తువ
వరాల వర్షం కురిపించాలని
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని
గనిలో వనిలో కార్ఖానాలో
పరిక్లమిస్తూ
పరిప్లవిస్తూ
ధనిక స్వామికి దాస్యం చేసే
యంత్ర భూతముల కోరలుతోమే
కార్మిక ధీరుల కన్నులనిండా

కణకణమండే
గలగల తొణికే
విలాపాగ్నులకు విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేడోయ్
నిరపరాధులై దురదృష్టంచే
చెరసాలలో చిక్కేవాళ్ళు
లోహరాక్షసుల పదఘట్టనచే
కొనప్రాణంతో కనలేవాళ్ళు
కష్టం చాలక కడుపుమంటచే
తెగించి సమ్మెలు కట్టేవాళ్ళు
శ్రమనిష్ఫలమై
జని నిష్ఠురమై
నూతిని గోతిని వెతికేవాళ్ళు
అనేకులంతా అభాగ్యులంతా
అనాథులంతా
అశాంతులంతా
దీర్ఘశ్రుతిలో తీవ్రధ్వనితో
విప్లవశంఖం వినిపిస్తారోయ్.

— శ్రీ శ్రీ

★

# ప్రజారధం

పదవోయిక పదవోయిక
ఇది నిజమే పద పద పద!
తరలందిదె ప్రజారథం,
పొరలింది ప్రపంచ పథం!!
ఇది మాత్రం నిజమనవోయ్
తుది సమరం ముగిసిందని!
రాగలదిక శాంతి యుగం.
కాగల అభ్యుదయ జగం!!
ఇది మాత్రం నిజమనవోయ్
ముది లోకం పోయిందని!
పదునైనది యువ జీవం
ఎదురైనది సమ భావం!!
ఇది మాత్రం నిజమనవోయ్
మదిలోభం మాసిందని!
ప్రతి జాతికి స్వాతంత్ర్యం
పర పీడా రాహిత్యం!!
ఇదిమాత్రం ఇది మాత్రం
ఇది మాత్రం నిజమనవోయ్
వికసించే విధానమున
మకుటధారి మానవుడని!!

— కృష్ణశాస్త్రి

# ఎఱ్ఱజండా

ఎగరాలి, ఎగరాలి మన యెఱ్ఱజెండా!
అదురు బెదురూ లేక అడ్డేదియును లేక
ఎగరాలి, ఎగరాలి!

సామ్రాజ్యవాదంబు సమసిపోవంగ
ధనికవాదంబెల్ల దగ్ధమైపోవ
ఎగరాలి, ఎగరాలి!

పేదరైతులమేన వేడిరక్తంబుంటె
కూలీల గొంతులో కొనవూపిరుంటేను
ఎగరాలి, ఎగరాలి!

కార్మికుల్ కర్షకుల్ కరము కరమూ కలిపి
జై మనకు జై యంచు జేజేలు కొట్టంగ
ఎగరాలి, ఎగరాలి
మన ఎఱ్ఱజెండా!

— తుమ్మల

★

# జయం......!

జయజయజయ నవభారత
యువవీరా జయముజయము!
జయము లోకశాంతిగా,
జయము ప్రాణ కాంతిగా,
జయజయజయ నవభారత
యువవీరా జయము జయము!
చిరుగుండెల తోరణాలు
జనుల కనులె హారతులై
పుడమియంత నీకోసం
వేడుతోంది వినవోయీ! జయజయజయ...
నవ పతాక నెత్తుము, మా
నవ పతాక నెత్తవోయి!
అజ్ఞానపు టడవిని నీ
వగ్ని రేఖవై నడువోయ్! జయజయజయ...
రాగం వినిపించుము, అను
రాగం వర్షించవోయి!
అవని మీద నరులంతా
అవిభక్త కుటుంబమోయి!
జయజయజయ నవభారత
యువవీరా జయము జయము!
జయము లోకశాంతిగా
జయము ప్రాణకాంతికా
జయజయజయ నవభారత
యువ వీరా జయముజయము!

— అనిసె

# ఏమి చేయాలి!

## లెనిన్

అనువాదం :

కంభంపాటి సత్యనారాయణ (సీనియర్)

175 పేజీలు వెల : రు. **1—5—0**

లెనిన్ యీ గ్రంథాన్ని 1902 లో రచించాడు. రాజకీయ ఆందోళన ఎలా వుండాలి ? పార్టీనిర్మాణం ఏపద్ధతుల్లో జరగాలి ? అది రష్యా దేశమంతటా ఒకేసారి సర్వతోముఖంగా వ్యాపింపజేయడాని కెట్టి ప్లాను అవసరం ? అనే మూడు సమస్యల్ని విపులంగా చర్చించాడు లెనిన్. తప్పక చదవవలసిన, అధ్యయనం చేయవలసిన గ్రంథం.

వివరములకు :—

విశాలాంధ్ర ప్రచురణాలయం,
బకింగ్‌హాంపేట పోస్టు
విజయవాడ-2

విశాలాంధ్ర బుక్ డిపో,
గవర్నరుపేట సెంటరు,
విజయవాడ.


BC

...పాటలు, బుర్రకథలు, నాటకాలు

| | | |
|---|---|---|
| ... (బుర్రకథ) | | 0—3—0 |
| ...జు | ,, | 0—4—0 |
| ...ం | ,, | 0—4—0 |
| ...వి | ,, | 0—3—0 |
| ...నా విప్లవం | ,, | 0—6—0 |
| ...స్సీ | ,, | 0—6—0 |

*

| | |
|---|---|
| ఎన్నికల పాటలు | 0—4—0 |
| విప్లవాత్మ (నార్లచిరంజీవి) | 0—3—0 |

* * *

| | |
|---|---|
| వీరకుంకుమ (సుంకర) | 1—0—0 |
| అల్లూరిసూర్యం (పిల్లల నా...) | 0—3—0 |

ప్రతులకు :—

విశాలాంధ్ర ప్రచురణాలయం

బకింగ్‌హామ్‌పేట పోస్టు : : విజయవాడ-2

Wrapper Printed at Swatantra Art Printers, Vijayawada-2

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

BCI

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | **AOUA104B115** |
| పుస్తకం పేరు | తెలుగు తొలకరి |
| తారీఖు | **31 December 2025** |
| ముందు అట్ట | No |
| వెనుక అట్ట | No Yes |
| మొత్తం పేజీలు | 65 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | 4 |
| లేని పేజీలు | No |
| తయారు చేసినది | P. Jayamma |
| పేజీలు విడదీసినది | P. Jayamma |
| స్కాన్ చేసినది | Hesmat |
| పరీక్ష చేసినది | |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | [illegible] |